క్లుప్తంగా

30న కాపు సంఘం సమావేశం

సింహాచలం : ఈనెల 30 ఆదివారం పెందుర్తి మండల కాపు సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్టు శ్రీకృష్ణ దేవరాయుల కాపు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్క కనకరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేపగుంట లోని శ్రీకృష్ణదేవరాయుల కాపు కల్యాణమండపంలో ఉదయం 9గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందన్నారు. సంఘం అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. కాపు సామాజిక సభ్యులందరూ ఈ సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌డీటీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

సింహాచలం : పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్‌డీటీ(నాన్ డిస్ట్రక్టివ్ టెక్స్టింగ్) వర్క్‌షాప్ నిర్వహించారు. నేషనల్ కెరియర్ సర్వీసెస్ ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన డి.శ్యామ్ ఈ దీనిని నిర్వహించారు. విద్యార్థులకు పలు పరిశోధనలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో వారు ఉద్యోగాలు పొందేందుకు ఇలాంటి వర్కుషాపులు ఎంతగానో దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా తెలిపారు.

పోలీసులకు అభినందనలు



పోలీసులను అభినందిస్తున్న డీసీపీ నాగన్న

సింహాచలం : కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన పెందుర్తి క్రైమ్ పోలీసులను శుక్రవారం క్రైమ్ డీసీపీ నాగన్న అభినందించారు. పెదనరవలోని చంటి అనే మహిళ మెడలోని రెండు తులాల బంగారం దొంగిలించిన కేసులో చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ పోలీసులు ముద్దాయిలను పట్టుకున్నారు. దీంతో క్రైమ్ ఎస్ఐ సల్మాన్‌బేగ్, కానిస్టేబుళ్లను డీసీపీ అభినందించారు.

తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలి



నిరసన ర్యాలీ చేపట్టిన సీఐటీయూ నాయకులు

పరవాడ: కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తాడి గ్రామాన్ని తరలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. గ్రామ సమీపంలో ల్యాండ్ ఫిల్లింగ్ నిర్మాణానికి ప్రభుత్వం 50 ఎకరాల స్థలాన్ని కేటాయించి రాంకీ యాజమాన్యానికి కొమ్ము కాస్తుందని ఆరోపించారు. ఈ స్థల అనుమతులను రద్దు చేయాలన్నారు. గ్రామా న్ని తక్షణమే తరలించడానికి ప్రభుత్వం చర్య లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం నూకరాజు, కె.రాము, పి.సత్య వతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

సింహాచలం: ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సూచించారు. పెందుర్తిలోని డీఆర్‌సీ మాల్ వద్ద వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై ఎస్ఐ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాన్ని నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాన్ని నడపడం నేరమని సూచించారు. గతంలో జరిగిన పలు ప్రమాదాలను స్క్రీన్ ద్వారా వాహనదారులకు చూపించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు.

ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం

- సీఎస్సార్ నిధులతో అభివృద్ధికి సంస్థలు ముందుకు రావడం అభినందనీయం
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- తానాంలో కమ్యూనిటీ భవనం ప్రారంభం



తానాంలో కమ్యూనిటీ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

పరవాడ: ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సంస్థలు కూడా ఇందుకు సహకరించడం అభినందనీయమన్నారు. మైలాన్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్సార్ నిధులు రూ.1.15 కోట్లతో తానాం గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ భవన సముదాయాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ భవన సముదాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మైలాన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు.

ఇంటింటి కుళాయి పథకానికి శంకుస్థాపన

రాష్ట్ర ప్రభుత్వం రూ.90 లక్షల వ్యయంతో గ్రామంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (జేజేఎం) ఇంటింటి కుళాయి పథకానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మైలాన్ పరిశ్రమ సీఎస్సార్ నిధులతో విద్య, వైద్యం, కమ్యూనిటీ, వెల్ఫేర్ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడడం ఆనందదాయకమన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయలక్ష్మి, మైలాన్ పరిశ్రమ హెడ్ ఎస్ఎం రావు, సీఎస్సార్ హెచ్ మైకేల్ డొమినిక, సంస్థ ప్రతినిధులు సునీల్ రాయ్ వాద్యా, ఎంపీపీ రామరాజు, జి. సరస్వతిరావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెన్నల సన్యాసిరావు , హౌసింగ్ ఏఈ రెడ్డి, పీఆర్ ఏఈ గండి రామారావు పాల్గొన్నారు.

నెలలో ప్రతి ఆఖరి ఆదివారం గ్లకోమా కంటి వైద్య శిబిరం

- శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు

సింహాచలం : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఈనెల 30 నుంచి నెలలో ప్రతి ఆఖరి ఆదివారాల్లో గ్లకోమా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ డీజీఎం కె.బంగార్రాజు శుక్రవారం తెలిపారు. ఆసుపత్రి గ్లకోమా స్పెషలిస్టు డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహణ ఉంటుందన్నారు. వ్యాధిని నివారించడంలో తగిన చికిత్స, సలహాలను రోగులకు అందిస్తామన్నారు. గ్లకోమా అనేది నిశ్శబ్దంగా కంటి చూపును హరించే ప్రమాదకరమైన వ్యాధి అని తెలిపారు. భారతదేశంలో 40 ఏళ్ల పైబడిన సుమారు కోటీ పది లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం, తగిన సమయంలో శస్త్ర చికిత్సలతో గ్లకోమాను నిరోధించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి సబ్బవరం, పరవాడ మండలాల్లోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వి.లలితకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్‌ను అనుసరించి, ఆయా కేటగిరీ అభ్యర్థులతో ఈ సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి, స్థానికంగా నివాసం ఉండే వివాహమైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులను ఏప్రిల్ 28 నుంచి మే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా అందజేయవచ్చని సూచించారు.

సబ్బవరం ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీల వివరాలు

మండలం	పంచాయతీ	అంగన్‌వాడీ కేంద్రం	పోస్టు	కేటగిరీ
సబ్బవరం	అసకపల్లి	అసకపల్లి-1	అంగన్‌వాడీ కార్యకర్త	ఎస్సీ
పరవాడ	వాడచీపురపల్లి	పోలిరెడ్డిపాలెం	అంగన్‌వాడీ కార్యకర్త	ఎస్సీ
సబ్బవరం	నాయనమ్మపాలెం	నాయనమ్మపాలెం	అంగన్‌వాడీ ఆయా	ఎస్సీ
సబ్బవరం	అంతకాపల్లి	రావలమ్మపాలెం-2	అంగన్‌వాడీ ఆయాఎస్సీ	
పరవాడ	వాడచీపురపల్లి	గొరుసువానిపాలెం	అంగన్‌వాడీ ఆయా	ఎస్టీ
పరవాడ	ముత్యాలమ్మపాలెం	దిబ్బపాలెం	అంగన్‌వాడీ ఆయా	ఎస్సీ
సబ్బవరం	నారపాడు	బలిజపాలెం	అంగన్‌వాడీ ఆయా	ఎస్సీ
పరవాడ	వాడచీపురపల్లి	నరసాపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఎస్సీ
సబ్బవరం	సబ్బవరం	గణపతిపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఎస్టీ
పరవాడ	పెదముషిడివాడ	విజయరామపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఎస్టీ
పరవాడ	కలపాక	మురిసివానిపాలెం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఎస్టీ

నిధుల దుర్వినియోగంపై ఎంపీడీవో విచారణ



జంగాలపాలెం రైతులు, నిర్వాసితులను విచారిస్తున్న ఎంపీడీవో వెంకటరావు

సింహాచలం: పెందుర్తి మండలం జంగాలపాలెం పంచాయతీ ప్రెసిడెంట్ గొరపల్లి నరసింగరావు నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగంపై ఎంపీడీవో వెంకటరావు శుక్రవారం విచారణ చేపట్టారు. పెందుర్తి మండలంలో ఉన్న జంగాలపాలెం పంచాయతీకి సంబంధించిన నిధులతో విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో రోడ్డు వేయడంతో ఆయన చెక్ పవర్‌ను కూడా ఇటీవల రద్దు చేశారు. అలాగే ఈవోఆర్‌డీ అప్పారావు కూడా విచారణ చేశారు. ఈ మేరకు గొరపల్లి నరసింగరావు జిల్లా కలెక్టర్‌కు అభ్యర్థన పెట్టుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు మరోసారి ఎంపీడీవో వెంకటరావు విచారణ చేపట్టారు. ఆ రోడ్డు ఉన్న విశాఖ, విజయనగరం జిల్లా ప్రాంతాల్లోని రైతులను విచారించారు. వారి పాస్‌బుక్‌లను తీసుకురావాలని సూచించారు. ఈ మేరకు సమగ్ర నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని వెంకటరావు తెలిపారు.

అదుపులోకి వచ్చిన మంటలు

- 19 గంటల పాటు 5 అగ్నిమాపక శకటాల సేవ
- పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు
- పొగ కారణంగా సాయంత్రం వరకు లోపలికి వెళ్లలేని పరిస్థితి



వస్త్ర దుకాణంలో కమ్మేసిన పొగ

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో యువరాణి వస్త్ర దుకాణంలో చెలరేగిన మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. గురువారం రాత్రి 11 గంటగలకు మంటల్ని గుర్తించిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు 11.05 గంటలకు సమాచారమందించారు. ఆ తరువాత అగ్నిమాపక సిబ్బందికి 11.15 గంటలకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన అధికారులు 11.30 గంటలకు మంటల్ని అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు శుక్రవారం సాయంత్రం వరకు కూడా కొనసాగాయి. పూర్తిగా మంటలు అదుపులోకి వచ్చినా పొగ మాత్రం వస్తూనే ఉంది. పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో కోట్ల నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మూడు అంతస్తుల్లో ఉన్న వస్త్రాలు, ఫర్నిచర్ విలువైన పరికరాలు అన్నీ కాలిబూడిదయ్యాయి. వస్త్ర దుకాణం ఉద్యోగి ఎస్.రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపట్నం సీఐ ఈదుల నరసింహారావు కేసు నమోదు చేశారు. అగ్నిమాపక అధికారులు కూడా ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల లేక మరే ఇతర కారణాల వల్ల జరిగిందో ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పూర్తి స్థాయిలో మంటలు అదుపులోకి రాకపోవడంతో నష్టాన్ని అంచనా వేయలేకపోతున్నామని తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ సురేష్‌కుమార్, వీఆర్‌వో సుబ్రహ్మణ్యం, సచివాలయం కార్యదర్శులు ఉన్నారు. సుమారు 19 గంటల పాటు నగరంలోని ఐదు అగ్నిమాపక శకటాలతో సిబ్బంది నిరంతరాయంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఏడీఎఫ్‌వో సుబ్బారావు స్వయంగా మంటలు ఆర్పే చర్యలను పర్యవేక్షించారు.

వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆశీనులను చేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్‌వో నాయుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం లక్ష రూపాయల విరాళాన్ని నగరంలోని లలితానగర్‌కి చెందిన వారణాసి ప్రమీల శ్రీనివాస్ అనే దాత అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై మే ఐహెల్ప్ యు కేంద్రంలో పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు నాయుడు బాండ్ అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి కృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంటర్ స్కూల్ క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక : స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో అంతర పాఠశాలల క్విజ్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరైన ఈ పోటీలను విక్రమ సింహపురి యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావు ప్రారంభించారు. 5, 6, 7 తరగతుల విభాగంలో యాపిల్ ఐ స్కూల్, ఎన్ఎస్‌టీఎల్, డీపీఎస్ వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. వారికి వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు నగదు బహుమతులను అందజేశారు. 8, 9, 10 తరగతుల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన యాపిల్ ఐ స్కూల్ విద్యార్థులకు రూ.10వేలు, ద్వితీయ స్థానం పొందిన ఎన్‌సీటీపీఎస్ విద్యార్థులకు రూ.7వేలు, తృతీయ బహుమతి పొందిన డీపాల్ స్కూల్ విద్యార్థులకు రూ.5వేలు, మిగిలిన విద్యార్థులకు రూ.2వేల కన్సొలేషన్ బహుమతిని అందజేసినట్టు పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఐకార్ వ్యవస్థాపక దినోత్సవం

దొండపర్తి : సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(ఐకార్) విశాఖ సెంటర్ 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూదనరావు సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఐకార్ విశాఖ రీజనల్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ చార్లెస్ జీవా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల హార్వెస్టింగ్, పెంపకంలో ఐకార్-సిఫ్ట్ విశేష సేవలందించిందని తెలిపారు. సిఫ్ట్‌కు మూడు సార్లు సర్దార్ పటేల్ ఉత్తమ ఐకార్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ శాస్త్రవేత్తలను సన్మానించారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చిన సుమారు 200 మంది విద్యార్థులకు కేంద్రంలోని పరిశోధన, కార్యకలాపాలను వివరించారు.

ప్రతి కుటుంబానికి అండగా.. సీఎం జగన్

- రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మడకపాలెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: కన్నూరు శివారు మడకపాలెంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే నేరుగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని గుర్తు చేశారు. కన్నూరు గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. పేదలకు సొంతింటి కలను నిజం చేసిన ఘనత కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, కన్నూరు ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్ మడక సూరిబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఎంఈవో సునీత, ఏపీఎం కనకమ్మ, పంచాయతీ కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేంకటేశ్వరస్వామి



అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం : పెందుర్తి వెంకటాద్రిపై శుక్రవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదికపై చక్రపెరుమాళ్లను ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భవిత కేంద్రానికి మెగాఫోన్ అందజేత



మెగాఫోన్ అందజేస్తున్న పైల శ్రీనివాసరావు తదితరులు

పరవాడ: పరవాడ గ్రామానికి చెందిన దివంగత పైల శిరీష 13వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు పైల అప్పారావు, ఆయన సతీమణి స్థానిక భవిత కేంద్రానికి బహూకరించిన రూ.6 వేల విలువైన మెగాఫోన్‌ను రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు చేతుల మీదుగా భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు పైల అప్పలనాయుడు, వెన్నెల సన్యాసిరావు, పైల హరీష్, పోతల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కి దివాకర్ కుటుంబానికి పరామర్శ



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కి దివాకర్ కుటుంబ సభ్యులను మర్రిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అందరితో కలిసికట్టుగా ఉంటూ అనేక సేవలందించిన దివాకర్‌ను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు, సత్యాల సాగరిక, సత్యాల వెంకట్, అప్పారావు, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గోపాలపట్నం: జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల, కళాశాలల పరిధి 9, 10 తరగతులు, ఇంటర్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎన్ఎస్టీఎల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. మే నెల 9, 10 తేదీల్లో ఉత్పత్తులు, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టయిన్‌బుల్ ఫ్యూచర్ అనే అంశంపై నమూనాల పోటీ జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రదర్శించనున్న నమూనాల వివరాలను ఆయా స్కూళ్లు, కాలేజీల ప్రిన్సిపాళ్లు మే 3లోగా సంస్థకు పంపించాలని సూచించారు. వివరాలకు 94902 32433, 93963 67120, 85390 88872 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన నమూనాలను 9, 10 తేదీల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా మౌంట్ డియోస్ స్కూల్ కల్చరల్ ఫెస్ట్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

దొండపర్తి : మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ కాన్వొకేషన్, కల్చరల్ ఫెస్ట్-2023 పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్‌కు అకడమిక్ కోఆర్డినేటర్ వరలక్ష్మి నేతృత్వం వహించగా ముఖ్య అతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. ముందుగా అధ్యాపకుల ఆధ్వర్యంలో బృందం ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూనియర్ సెకండరీ విద్యార్థిని శర్వాణి నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించింది. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై వారి ప్రతిభను ప్రదర్శించారు. సంగీతం, పాటలు, డ్యాన్స్‌లతో అందరినీ ఉర్రూతలూగించారు. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్య వందన సమర్పణ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అక్కిరెడ్డిపాలెం: మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి సీహెచ్.చరణ్‌తేజ, 8వ తరగతి విద్యార్థిని డి.మహిమ విజేతలుగా నిలిచారు. వారికి స్థానిక యూపీహెచ్‌సీ వైద్యురాలు ప్రియాంక, అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్.సత్యనారాయణ, హెచ్ఎం ఎం.ఎల్.ఎస్. కాంతం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏలు మేడిద మురళీకృష్ణ, కొత్తర అప్పలరాజు, స్కూల్ పీడీ మహ్మద్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.